ఒక చిన్న ప్రపంచపు సరిహద్దుల్ని దాటి కొన్ని రోజుల క్రితమే సువిశాల విశ్వంలో అనుకోకుండా అడుగుపెట్టిన నానీ ఇక్కడ మాలిన్యానికి నిర్వచనం తెలీక వూపిరందని ఓ నిజంలా గిలగిలా కొట్టుకుంటుంటే-

నానీని ఎత్తుకున్న ఆ వ్యక్తి ఓ ఫర్లాంగ్ దూరంలోని నిర్జన ప్రదేశానికి అతడ్ని తీసుకొచ్చి విసురుగా నేలపై కుదేశాడు.

"దొంగ నాయాలా?"

ఒక్కో అడుగూ ముందుకేస్తున్న ఆ వ్యక్తి ఎవరో తన నెందుకు హింసిస్తున్నాడో తెలీని నానీ బిక్కమొహం వేసుకుని చూస్తున్నాడు భయంగా!

"నానీ...."

"పెద్ద మొనగాణ్ననుకున్నావా.... వేలెడు లేవు."

అప్పటికే ఆ వ్యక్తి మరీ దగ్గరవుతూ సమీపించడంతో "నన్ను కొట్టకు అంకుల్..."

అంటూ వెక్కిపడుతూనే ఆ వ్యక్తి కాళ్లను చుట్టేశాడు.

ఆ వ్యక్తి జాలి పడలేదు.

జాలి అన్నది తమ నిఘంటువులోనే లేదని నిరూపించే వ్యక్తులు ఈ ప్రపంచంలో వుంటారని తెలియచేయడానికి కంకణం కట్టుకున్నట్టు అమాంతం నానీ జుట్టు పట్టుకున్నాడు.

"నన్నెందుకు కొడతావంకుల్. నేనేం తప్పుచేశాను....?" అన్నాడు నీరసంగా వణికిపోతూనే.

"ఏం తప్పా! నువ్వక్కడ చెప్పబోయింది"

"వద్దంకుల్.... దొంగ నిజంగా అక్కడున్నాడు. నేను నిజమే చెప్పాను."

ఆ వ్యక్తి చేయి ఫెడీల్మని నానీ చెంపని తాకింది మరో మారు.... "అదేరా- అదే తప్పు"

అప్పటికీ నానీకి తోచలేదు.

"నా కొడకా.... నాకు చెప్పావు గాని అదే మరొకడెవడైనా వింటే మా వాడు పట్టుబడిపోయేవాడు. ఆ తర్వాత జనం వాడి కాళ్ళూ చేతులూ విరగ్గొట్టేవారు. నిజం చెప్పాడట.... నిజం....".

నానీ క్రమంగా స్పృహని కోల్పోయాడు.

ఇప్పుడు నానీ పెదవుల మధ్యనించి దాగలేని నిజంలా..... రక్తం పైకి చిమ్ముతోంది.

** ** ** **

సుమారు ఏడు గంటలు ప్రయాణం చేసిన ఫియట్ మధ్యాహ్నం దాటాక మూడున్నర గంటల ప్రాంతంలో మార్టూరు చేరుకుంది.

అప్పటికే హరిత బాగా అలిసిపోయింది.

కాని తన అలసట కనిపించకుండా ఉత్సాహాన్ని నటిస్తోంది.

ఆ ప్రయాణంలో యశస్వి సామర్లకోటలో ఓ అరగంట మాత్రమే ఆపాడు. అదీ హరిత కోసమని. హరిత కూడ భోంచేయలేదు. కొద్దిగా టిఫిన్ చేసింది.

బయలుదేరే ముందు తండ్రికి మాట మాత్రం ఫోన్‌చేసి చెప్పింది. ఓ మూడు రోజులపాటు యశస్వితో వూరెళుతున్నట్టు.

పట్టిన పట్టు విడవని మొండిపిల్లగా తెలిసిన పాండురంగారావు హరితని కాదనలేదు.

పెళ్ళి కాకుండా యశస్వితో అలా వెళ్ళడమన్నది మామూలుగా అయితే ఆబ్జెక్ట్ చేసేవాడేమోగాని, ఇప్పటి స్థితిలో ఆమెను నిరుత్సాహపరచడానికి ఆయనకి మనస్కరించలేదు.

మార్టూరు గ్రామంలో ప్రవేశించాక రతి యింటి అడ్రస్ కోసం ఓ చోట ఆపి ఎంక్వయిరీ చేశారు.

మరో అయిదు నిముషాలలో కారు ఓ పెద్ద లోగిలిలాంటి యింటి పోర్టికోలో ఆగింది.

ఎప్పుడో కాలేజీలో క్లాస్‌మేట్ అయిన హరితని చూడగానే ముందు అవాక్కయిపోయిన రతి ఆ తరువాత సాదరంగా లోపలికి ఆహ్వానించింది.

"రియల్ సర్‌ప్రైజ్" సోఫాలో కూర్చున్నాక నవ్వుతూ అంది రతి.

అన్ని వివరాలు తెలియపరచలేదు హరిత. ముక్తసరిగా యశస్విని తన 'వుడ్ బి'గా పరిచయం చేసి ఆ రోజు దిన పత్రికలో పడిన నానీ ఫోటోని చూపించింది.

"నానీ మావాళ్ల అబ్బాయి- తప్పిపోయాడని మేమంతా వెతుకుతూంటే, ఇదిగో యిలా పేపర్‌లో ప్రత్యక్షమయ్యాడు. గనికొండ ఈ పక్క విలేజ్ కాబట్టి వెళుతూ నిన్ను కలుసుకోవాలనిపించింది".

"యు హేవ్ డన్ గుడ్ థింగ్. ఎందుకంటే....." రతి క్షణం ఆగింది.

"నానీని యిలా వాళ్ళు వాడుకోవడం చూసి నేనూ ఆశ్చర్యపోయాను కాబట్టి" క్లుప్తంగా చెప్పింది. నానీ కారులో తనను మార్టూరు వరకు 'లిఫ్ట్' అడిగిన విషయం ....

ఈ సారి ఆశ్చర్యపోవడం యశస్వి వంతయింది.

"నిజానికి నానీ వివరాలు పూర్తిగా తెలుసుకోలేదు. కానీ పరిచయమైన కొన్ని గంటల్లో ఓ ఇంటలిజెంట్ బోయ్‌గా మాత్రం అర్థమైపోయింది. అసలు హోమ్ మినిష్టర్ కారు ముందుకు ఎలా వెళ్ళాడు? ఎవరు తరుముతూండగా ఆయన రక్షించాడూ.....? అన్నది నేనూహించలేకపోయాను. అదే విషయం మా కజిన్ను అడిగి తెలుసుకోవాలనుకున్నాను".

"ఆయనెవరు-?" హరిత అడిగింది.

"రాందేవ్ అని-నిజం పత్రిక చీఫ్ రిపోర్టర్-నిన్న ప్రెస్ కాన్ఫరెన్స్‌కి వెళుతూ నా దగ్గరికి వచ్చాడు కూడా-"

"ఆయనెక్కడుంటారు?"

రతి మొహంలో రంగులు మారిపోయాయి హఠాత్తుగా.

"ఉండేది రాయకొండలో అయినా, ప్రస్తుతం చావు బతుకులమధ్య టౌన్ హాస్పిటల్లో వున్నాడు."

విభ్రమంగా చూశాడు యశస్వి.

"అవును.... నిన్న రాత్రి ఆయనపై హత్యా ప్రయత్నం జరిగింది. అర్థరాత్రి దాటాక రక్తపు మడుగులో పడున్న రాందేవ్‌ని ఓ పోలీస్ పెట్రోలింగ్ వేన్‌లో హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. అప్పట్నించీ స్పృహలోకి రాలేదు. బట్ డాక్టర్స్ యింకా ప్రయత్నం చేస్తూనే వున్నారు. ఉదయం వెళ్ళాను. పరిస్థితి అనుమానంగానే వుందంటున్నారు. నిజానికి ఇప్పుడు బయలుదేరబోతున్నది అక్కడికే-"

"దెన్-వై డోంట్ వియ్ మేక్ మూవ్-" యశస్వి లేచాడు.

కాఫీలు అయ్యాక వెళదామని వారించబోయింది రతి.

కాని హరిత నచ్చచెప్పింది "ఆయన చెప్పగలిగే పరిస్థితిలో లేక పోయినా అక్కడ నిన్న ప్రెస్ కాన్ఫరెన్స్‌కి వచ్చిన విలేకర్లు ఎవరన్నా కలిసే అవకాశం వుంది-మరేం లేదు రతీ! నానీ ఒక ప్రమాదంలో చిక్కుకోబోతున్నాడని మా అనుమానం."

"హోమ్ మినిష్టర్ అప్పారావుగారి గెస్ట్ హౌస్‌కి వెళ్ళి ఆరా తీయొచ్చుగా" రతి అంది.

"నానీని తన అవకాశవాదంతో వినియోగించుకున్న అప్పారావు అంత సులభంగా వివరాలు యిస్తాడని మీరెలా అనుకుంటున్నారు?" యశసి అన్నాడు సాలోచనగా.

మరో నలభై నిముషాలలోగవర్నమెంట్ హాస్పిటల్‌కు చేరుకున్నారు.

కారు దిగిన రతి కారిడార్‌లోనే షాక్ తిన్నట్టు ఆగిపోయింది.

రాందేవ్ శవాన్ని స్ట్రెచర్‌పై బయటికి తీసుకొస్తున్నారు సరిగ్గా అప్పుడే.

తెరిచివున్న రాందేవ్ కళ్ళలో ఏదో చేయలేకపోయిన అసంతృప్తి స్పష్టంగా కనిపిస్తోంది.

రతి కళ్ళలోని నీళ్ళను చూస్తూ అంటున్నారెవరో "టేకిట్ ఈజీ మేడమ్.... అర్థరాత్రివేళ అత్యాచారాలు జరిగేది ఆడవాళ్లమీదే కాదు. అసాధారణమయిన వాస్తవాన్ని పైకి తీయాలనుకున్న జర్నలిస్టుపై కూడా."

ఇప్పుడు చూశాడు యశస్వి.

ఆ మాటలంటున్నది మాసిన గెడ్డంతో చూడటానికి భిక్షగాడిలా వున్న వయసు మళ్ళిన వ్యక్తి. బాగా తాగినట్టు అతడి రెప్పలు బరువుగా వాలిపోతున్నాయి.

"నాకు తెలుసు- అన్నయ్య ఇలాంటి ఆపదలో ఎప్పటికయినా చిక్కుకుంటాడని...." గొణుగుతున్నట్లుగా అంది రతి కళ్ళొత్తుకుంటూ.

"నీకే కాదమ్మా.... తోటి జర్నలిస్టులమైన మా అందరికీ తెలుసు. కాని ఉడుకు రక్తం, చెబితే విన్నాడా.... వాస్తవాల్ని వెలికితియ్యడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతున్నా ఆ స్కౌండ్రల్స్‌ని రక్షించే నాయకులున్నంతకాలం అలాంటి రాజకీయం, దాన్ని కాపాడే కేపిటలిజమ్ బ్రతికున్నంతకాలం మనం న్యూస్ రాసే విలేఖర్లుగానే బ్రతకాల్రా అంటే 'నిజం'

'నిజం' అంటూ న్యూసెన్స్ సృష్టించబోయాడు. పోయాడు." భుజాల దగ్గర చిరిగిన లాల్చీ పక్క జేబులో నుంచి ఓ చిన్న బాటిల్ అందుకుని గడగడా తాగాడు మిగిలివున్న విస్కీని.

ఇక అక్కడ నిలబడే అవసరం లేదన్నట్టు ఉద్రేకంగా రెండడుగులు ముందుకేసి "అయినా వీడికెందుకమ్మా.... నన్ను చూసయినా నేర్చుకోవచ్చుగా.... నా బ్రతుకు గమనించయినా కాస్త ఒళ్లు దగ్గర పెట్టుకోవచ్చుగా. ఎందుకు లోతుగా వెళ్ళాలనుకోవడం..." అంటూ చివరగా రాందేవ్ శవం దగ్గరకొచ్చాడు.

కళ్లనుంచి ఉబికివస్తున్న కన్నీళ్లను దాచుకోవడానికేమో మోచేతిని కళ్ళకు అడ్డంగా వుంచాడు "రాందేవ్.... ఈ రామ రాజ్యంలో నిజాన్ని వెలికితీసి ఇప్పుడు మరో
లోకంలో అవినీతే వున్నా ఈ అనుభవంతో జాగ్రత్తగా నవరంధ్రాల్ని మూసుకుని బ్రతుకు. బ్రతికిపోతావు. ఆ...."

యశస్వి అందరిలా పరిశీలించడంలేదు. ఒక పోలీసాఫీసరుగా అతని మాటల్లోని లోతుని, ఆ వ్యక్తి అంతరాళంలో జరుగుతున్న సంఘర్షణని బేరీజు వేస్తూ పక్కనున్న ఎవర్నో అడిగాడు ఆయన ఏ పత్రిక విలేఖరి అంటూ.

"రామసూరి- అనుదినం పత్రిక...." అతడి మాటలింకా పూర్తి కాలేదు.

వెళ్ళిపోతున్న రామసూరిని వేగంగా చేరుకున్నాడు యశస్వి.

రామసూరిని ప్రత్యక్షంగా చూసినప్పుడు గుర్తు పట్టలేదేమో కాని ఎవరికి తెలుసు అతడెంత సెన్సేషనల్ జర్నలిస్టో....

ఒకనాడు ఉగ్రవాదుల్ని సంస్కరించే ప్రయత్నంలో అతి ప్రమాద భూయిష్టమైన అడవుల్లోకి అడుగుపెట్టి, వేల కిలోమీటర్లు కాలి నడకన ప్రయాణం చేసి పోలీసులు గాలిస్తున్న తీవ్రవాదుల్ని తను ఒంటరిగా కలుసుకుని ఇంటర్వ్యూ చేసి పత్రికల్లో ప్రచురించి జర్నలిజానికి కొత్త వూపు నందించిన ఆ వ్యక్తి పేరు ఈ తరం మర్చిపోగలదా?

చివరికి ఏం దక్కించుకున్నాడు?

ఉగ్రవాదులతో సంబంధముందన్న నేరంతో ఏడేళ్ళు కఠిన కారాగార శిక్ష అనుభవించాడు. అతని కుటుంబం చూసే దిక్కులేక, ఆదుకునే నాధుడు లేక ఆత్మహత్యలతో కడతేరిపోయింది.

యశస్వి కళ్లల్లో మనుషుల మేధకు తోచని ఓ మహాత్ముణ్ణి కలుసుకున్న తాదాత్మ్యత.

"నమస్కారం ! నా పేరు యశస్వి."

ఒక్క బొట్టూ మిగలని ఖాళీ బాటిల్‌ని విసిరి "సో వాట్?" అన్నట్టుగా చూశాడు రామసూరి.

"నేనెవరో మీకు తెలిసేటంతటి గొప్పవాణ్ణి కాదు. కాని మీ గురించి నేను విన్నాను. చదివాను."

"నాది రాయబడేంత గొప్ప చరిత్ర కాదే"

"కాని మనుషుల మనసుల్లో శిలాక్షరాల్లా నిలిచిపోయిన జీవితం మీది"

"అవును..." నవ్వేడు ఉన్మాదిలా "ఈ వ్యవస్థ శిలగా మారేక రాయబడిన చరిత్ర కాబట్టి అవి శిలాక్షరాలే అయి వుండొచ్చు. చెప్పండి నాతో ఏమన్నా పనుందా?".

అతడంత సూటిగా ప్రశ్నించేసరికి కొద్దిగా తత్తరపడిన యశస్వి "రాందేవ్ విషయంలో ఇప్పుడు ఏం చేయబోతున్నారు?" అన్నాడు.

"ఏం చేస్తాను- ఒక నిజం సజీవంగా సమాధి చేయబడింది అంటూ పత్రికల్లో రాస్తాను. బస్.... అంతకన్నా ఏం చేయగలను?"

"నిజం సజీవమైనప్పుడు నేలలో సమాధి చేస్తే అది గమ్మత్తుగా తిరిగి మొలకెత్తుతుంది"

"మిష్టర్ యశస్వీ! భాక్రానంగల్, నాగార్జునసాగర్ డామ్స్‌ని కల్తీ సిమెంటుతో నిర్మించినా ఈ దేశంలో నిజాన్ని సమాధి చేసేటప్పుడు మాత్ర నిఖారైన మంచి సిమెంటును వాడతారు అది మళ్ళీ మొలకెత్తకుండా. అదీ మన ఘనమైన సాంప్రదాయం."

"అలాంటి సాంప్రదాయాన్ని తూర్పార బెట్టిన వ్యక్తులు మీరు."

"అందుకే ఆరిపోయాను".

"ఋతువుల్ని బట్టి పరిమాణం మారొచ్చుగాని జీవనది ఇంకిపోదు."

"ఇంకిపోలేదు... గడ్డకట్టుకుపోయింది"

ఎవరీ మనిషి? ఎందుకు తన మనసు లోతుల్లోకి చొచ్చుకుపోతున్నాడూ అనుకుంటూ అసహనంగా జవాబిచ్చాడు రామసూరి "నేను ఇప్పుడు చేవున్న చావులాంటి బ్రతుకు నీడ్చుకొస్తున్న బ్రతికున్న శవాన్ని.... ఏం
ఆశించి నన్నిలా రెచ్చగొడుతున్నారో నా కర్థం కావడంలేదు."

"రాందేవ్ చావుని పత్రికలో శ్రద్ధాంజలితోనే సరిపెట్టకండి.... భయం ఎలాగూ లేదు కాబట్టి ఆ పనికి మీరే నడుం కట్టాలి".

రామసూరి అస్థిమితంగా కదిలాడు.

"ఈ ప్రయత్నాన్ని మీరు తప్ప మరొకరు విజయవంతంగా నిర్వ ర్తించలేరు".